## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపిటిసిలు



బషీరాబాద్, జనవరి 24, ప్రభాతవార్త: తాండూర్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ని బషీరాబాద్ మండల ఎంపిటిసిలు మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో కలిశారు. మండల అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యేను కలిసి మాట్లాడినట్లు వారు తెలిపారు. ఇదిలా ఉండగా ఎంపిటిసిల సమస్యలను గత నాలుగు సంవత్సరాల నుండి ఎంపిపి కరుణ అజయ్ ప్రసాద్ పట్టించుకోవటం లేదంటూ ఆమెపై అవిశ్వాసం వ్యక్తం చేసినట్లు విశ్వాసనీయ సమాచారం. ఎమ్మెల్యేను కలిసిన వారిలలో శ్రీధర్, రాజు, వడ్డే శ్రీనివాస్, సురేష్, నాయకులు రాజురెడ్డి, సాయిలు గౌడ్, పవన్ ఠాకూర్, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రంరెడ్డి తదితరులు ఉన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## 26న వర్గల్ శ్రీసరస్వతి ఆలయానికి ప్రత్యేక బస్సుల ఏర్పాటు : ఆర్టీసి డిఎం

శామీర్‌పేట, జనవరి 24, ప్రభాతవార్త

వసంత పంచమిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన వర్గల్ శ్రీసరస్వతి (టెంపుల్) మాత ఆలయంకు ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ భవభూతి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట మండలంలోని హకీంపేట్ ఆర్టీసి డిపో ఆధ్వర్యంలో వర్గల్‌కు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 5.15గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ (గురుద్వార్) నుంచి శామీర్‌పేట రాజీవ్‌రహదారి మీదుగా వర్గల్‌కు ప్రత్యేక బస్సులు నడపటం జరుగుతుందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ (గురుద్వార్) నుంచి ప్రతి 20నిమిషాలకు ఒక బస్ వర్గల్ సరస్వతి మాత ఆలయంకు బయలు దేరుతుందని అన్నారు. అయితే ఈ బస్సులో పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30లు అని వివరించారు. సాయంత్రం 18.15లకు సికింద్రాబాద్ నుంచి చివరి బస్సు ఉంటుందన్నారు. ప్రతి 20నిమిషాలకు ఓ సారి ఆర్టీసి బస్సులు నడుపుతున్నందున భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. హకీంపేట్ డిఎం భవభూతితో పాటు అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌లు వివరాలు తెలియజేశారు. బస్సుల గురించి సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు 9959559547, 9866314253, 9959226144 ను వారు వివరించారు.

# ఇసుక జోరు.. ట్రాక్టర్ల హోరు

- రాత్రిళ్లు రాచమార్గం
- అధికారుల చోద్యం

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :
మళ్లీ ఇసుక అక్రమ రవాణా జోరు పెంచింది. రెండు రోజుల విరామం తీసుకుంటూ ట్రాక్టర్లలో దర్జాగా తరలిస్తున్నారు. తాండూరు నియోజకవర్గం నుంచి సాగుతున్న ఇసుక దందాను అరికట్టాలన్న విన్నపాలు అరణ్యరోధనలుగా మిగిలిపోతున్నాయి. రాత్రిపూట వాహనాలకు అడ్డు వచ్చిన వారిని ఢీకొట్టేందుకూ ఇసుకాసురులు వెనకాడటం లేదు. ఇటీవల బషీరాబాద్ మండలంలో ఏకంగా ఓ పోలీస్‌కానిస్టేబుల్ పైకి ట్రాక్టర్‌ను ఎక్కించిన సంఘటన ఉదహరించవచ్చు. ప్రస్తుతం తీవ్రగాయాల నుంచి సదరు కానిస్టేబుల్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ఆ సంఘటన తర్వాత పూర్తిగా ఇసుక రవాణా అరికడతారని ప్రజలు భావించారు. కానీ.. అప్పటి నుంచి మరింత పెట్రేగిపోయిన ఇసుకాసురులు రాత్రిళ్లు మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను తోలుతున్నారు. గమ్మత్తేమిటంటే.. రాత్రిపూట పోలీసు వాహనం పెట్రోలింగ్ చేసిన కొంతసేపటికే ఇసుక ట్రాక్టర్ల మోత వినిపిస్తుంది. ట్రాక్టర్‌కు ముందూ, వెనకా ఇద్దరు వ్యక్తులు మోటారుబైక్‌లు వేసుకుని రవాణా చేస్తున్నారు. ఎవరైనా అడ్డొస్తే దాడులకూ సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఇనుపరాడ్లు, లాఠీలు, కొందరైతే తల్వార్లను వెంట తెచ్చుకుంటున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. వీరిని అడ్డుకోవడం సామాన్య ప్రజలకు కష్టసాధ్యం. రాత్రిపూట ట్రాక్టర్ల రణగొణ ధ్వనులకు నిద్ర పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు మరీ అసౌకర్యానికి గురవుతున్నారు. బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల్లో రెండు రోజులకు ఒకసారి జరిగే అక్రమ రవాణాపై ఆయా శాఖల అధికారులు ఫోకస్ పెట్టడం లేదు. వారికి బలమైన రాజకీయ అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెండు నెలల క్రితం ఇసుక రవాణా చేస్తే ఇరువర్గాల మధ్య గొడవలు కూడా జరిగాయి. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం వెళ్లినట్లు తెలిసింది. కొద్ది రోజులుగా స్తబ్ధుగా ఉన్న ఇసుక రవాణా రెండు వారాల నుంచి ఊపందుకుంది. దీనిపై రెవెన్యూ, మైనింగ్ శాఖలు మౌనం వహించగా పోలీసుశాఖ మాత్రం అప్పుడప్పుడు అడ్డుకుంటోంది. ఇక టాస్క్‌ఫోర్స్ అధికారులు కూడా మొక్కుబడిగా దాడులు జరుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఒక్కోసారి వారి దాడుల సమాచారం ముందస్తుగా లీక్ అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా ఉండగా కొంతమంది మాజీ ఇసుకాసురులు దందాకు దూరంగా ఉంటున్నా తమ ట్రాక్టర్లను మాత్రం లీజుకు ఇచ్చారని తెలియవచ్చింది.

## దేశంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

-బిజెపి పాలిత రాష్ట్రాలో అభివృద్ధి శూన్యం

-కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

-రాజబొల్లారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజబొల్లారంలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 24. ప్రభాతవార్త ః
రాబోయే ఎన్నికల్లో దేశంలో బీఆర్ఎస్ పార్టీ పాగా వేయడం ఖాయమని, దీన్ని తట్టుకునే శక్తి బీజేపీతో సహ ఏ ఇతర పార్టీలకు లేదని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో రూ.50 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, అంతర్గత మురికి కాలువల నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 19 బిజెపి పాలిత రాష్ట్రాలున్నాయని, అందులో ఏ రాష్ట్రం కూడ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి దీటుగా ముందుకు సాగలేదని నిరూపితమైతున్నదని ఆయన అన్నారు. కేవలం తెలంగాణ పోటీ పడలేని బిజెపి పాలిత రాష్ట్రాలు 2024వ సంవత్సరంలో డీలా పడటం ఖాయమన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేని బిజెపి నాయకులు విమర్శనాస్త్రాలు వేసి ప్రజలను మభ్యపెట్టడం చూడటం తప్ప వారికి అభివృద్ధిలో పోటీ పడటం చేతకాదని ఎద్దేవా చేశారు. దేశంలో బిజెపి పార్టీ ప్రజా వ్యతిరేక విదానాలకు ప్రజలు విసిగి వేసారి, బీఆర్ఎస్ పార్టీ కోసం ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. ఇటీవల రాష్ట్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభను చూసి బిజెపి నాయకులకు కండ్ల బైర్లు కమ్ముతున్నాయన్నారు. త్వరలోనె దేశం మొత్తంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతాపం చూపనున్నదని కేసీఆర్ తెలంగాణలో చేసిన అభివృద్ధిని దేశంలో కూడ చేయాలని ప్రజలు ఉవ్విళూరుతున్నారని అన్నారు. 2014లో బిజెపిని ఎదుర్కొని బీఆర్ఎస్ పాలన రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి, జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేష్, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, గ్రామ ఉప సర్పంచ్ నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, సుదర్శన్, రణదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా బిజెపి నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 24, ప్రభాతవార్త
బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మేడ్చల్ జిల్లాకు చెందిన బిజెపి నాయకులు పాల్గొన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనటానికి తరలివెళ్లటం జరిగింది. మేడ్చల్ జిల్లా నుంచి పాల్గొన్న వారిలో మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి కొల్లి మాధవి, జిల్లా ఇన్‌చార్జి నరేందర్‌రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు బుద్ధి శ్రీనివాస్, జాతీయ బిజెపి గిరిజనమోర్చ నాయకులు బిక్కు నాయక్ తదితరులు పాల్గొనటం జరిగిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. బిజెపిని మరింత బలోపేతం చేయటానికి, రానున్న ఎన్నికలకు సిద్ధం కావటానికి పార్టీ నాయకులను, కార్యకర్తలను సిద్ధం చేయటానికి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మార్గదర్శకం చేయటం జరిగిందని జిల్లా నాయకులు పేర్కొన్నారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పనిచేయటానికి బిజెపి పార్టీ సిద్ధం అవుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.




మేడ్చల్ జిల్లాకు చెందిన బిజెపి నాయకులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న దృశ్యం

## బకాయిలను వెంటనే విడుదల చేయాలి

-ఆమనగల్లులో ఏబివిపి ధర్నా



ఆమనగల్లులో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు, ఏబివిపి నాయకులు

ఆమనగల్లు, జనవరి24, ప్రభాతవార్త:
రాష్ట్రంలో బకాయిపడ్డ ఫీజ్ రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబివిపి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆమనగల్లు నగర కార్యదర్శి పురుగుల శివ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో విభాగ్ కేల్ ఇంచార్జ్ లండం మల్లేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరటి భరత్‌లు హాజరైనారు. స్థానిక ప్రభుత్వ కళాశాలల విద్యార్థులతో కలిసి పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో ఆంధోళనకారులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈసందర్భంగా లండం మల్లేశ్, గోరటి భరత్, పురుగుల శివలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని అధోగతిపాలు చేస్తుందని విమర్శించారు. విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదవులకు దూరం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 5వేల కోట్లు ఫీజ్‌రియంబర్స్‌మెంట్ బకాయిపడిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే బకాయిలను విడుదల చేయకపోతే ఏబివిపి ఆంధోళనలను మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొట్ర సురేష్, తరుణ్, సుమన్, శివగౌడ్, అంజి, మల్లేశ్, శివకన్నా, చరణ్, మనోజ్, శివ, నవీన్ తదితరులు ఉన్నారు.

# నేర శాతాన్ని తగ్గించాలి

- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర - 2023 సంవత్సరానికి గాను లక్ష్యాలపై శంషాబాద్ జోన్ పోలీస్ అధికారులకు సీపీ దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర.



. హాజరైన పోలీస్ అధికారులు.

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 24, (ప్రభాతవార్త) :
సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని శంషాబాద్ జోన్ లోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరానికి గాను చేదించే లక్ష్యాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని శంషాబాద్ జోన్ లోని అన్ని పోలీస్‌స్టేషన్లలో నేరాల సంఖ్యను తగ్గించే విధంగా పోలీసు సిబ్బంది పని చేయాలన్నారు. ముఖ్యంగా బేసిక్ పోలిసింగ్, సెక్టార్ వైస్ పోలీసింగ్ పై దృష్టి సారించాలన్నారు. అత్యుత్తమ పనితీరును కనబర్చాలన్నారు. సెల్ఫ్ డ్రివెన్‌తో మోటివేషన్‌తో పనిచేయాలన్నారు. త్వరితగతిన కన్విక్షనలను ట్రయల్‌కు తీసుకురావాలన్నారు. సెక్టార్ ఎస్సైలు పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సెక్టార్ ఎస్సైలది కీలకపాత్ర అన్నారు. సెక్టార్ ఎస్సైలు వారి సెక్టార్లలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. నేరాలను తగ్గించేందుకు సెక్టార్ ఎస్సైలు సరికొత్త స్ట్రాటజీలతో ముందుకు వెళ్లాలన్నారు.. సెక్టార్ ఎస్సైలు ముఖ్యంగా ఇన్వెస్టిగేషన్, సీన్ విజిట్, బైండోవర్, నేరం జరిగిన ప్రాంతం, పీడీ యాక్టులపై దృషి పెట్టాలన్నారు. పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ షీట్స్ ద్వారా ఎప్పటికప్పుడు సెక్టార్ ఎస్సైలు పనితీరును అంచనా వేయడం జరుగుతుందన్నారు. కోర్టు పని, ఎన్‌ఫోర్స్‌మెంట్, పాయింట్స్ బుక్, పోలీసింగ్‌కి సంబంధించిన వివిధ నైపుణ్యాలు, న్యాయ పరిజ్ఞానం, నేర పరిశోధనలో నాణ్యత, టెక్నికల్ నైపుణ్యాలు తదితర అంశాలను పరిగణంలోకి తీసుకొని సెక్టార్ ఎస్సైలకు మార్కులు ఇచ్చి వారి పెర్ఫార్మెన్స్‌ను పరిశీలిస్తున్నామన్నారు. ముఖ్యంగా పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులపై దృష్టి సారించాలన్నారు. కోర్ట్ ట్రయల్‌కు మొదటి రోజు ఖచ్చితంగా హాజరు కావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇన్‌స్పెక్టర్లు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలి అన్నారు. సెక్టార్ ఎస్సైల పనితీరుపై తానే స్వయంగా దృష్టి సారిస్తానని సీపీ అన్నారు. రాష్ట్రంలోనే సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని శంషాబాద్ జోన్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, రూరల్ సబ్ అర్బన్ ప్రాంతాలు ఉన్నందున శాంతి భద్రతలు కీలకమన్నారు. 2023 సంవత్సరానికి గాను అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి నేర నియంత్రణలో సాధించాల్సిన లక్ష్యాలపై దిశ నిర్దేశం చేయడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన అన్ని కేసులను చట్టప్రకారం నాణ్యమైన పద్ధతులలో దర్యాప్తు చేసి త్వరతగతిన చార్జ్ షీట్లు వేసి కోర్టులలో దర్యాప్తు అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. కోర్టు అటెండెన్స్, కన్విక్షన్లు, సాక్షాల సేకరణపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా సెక్టార్ ఎస్సైలు బేసిక్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గురించి తదనుగుణంగా పాయింట్ పుస్తకాల పునర్ వ్యవస్థీకరణ చేయాలన్నారు. ఎంఓ క్రిమినల్స్, హిస్టరీ షీటర్స్, రౌడీ షీటర్ల కార్యకలాపాలపై స్థానిక ఎస్‌హెచ్‌ఓలు నిఘా ఉంచి వారు ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనకుండా చూడాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడాలని ఆదేశించారు. పీడీ యాక్ట్‌ల నమోదు, సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులను త్వరితగతిన లోక్ అదాలత్, కన్విక్షన్లు తీసుకురావాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. అలాగే సిబ్బందికి అవసరమైన ఏదైనా సామాగ్రి కావాలన్న సమాచారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదులపైన తక్షణమే స్పందించాలి అన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు.

అదేవిధంగా ట్రాఫిక్ సమీక్ష 2023 లక్ష్యాలకు సంబంధించి మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను తగ్గేలా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రూరల్ ప్రాంతాల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేకింగ్ చేపట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్ చెకింగ్‌ల సమయంలో అవసరమైతే లా అండ్ ఆర్డర్ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ పనులకు సంబంధించి వివిధ స్టేక్ హోల్డర్లతో భాగస్వామ్యం చేసుకొని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్ సింగన్వర్, శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడ్మిన్ డీసీపీ శ్రీమతి ఇందిరా, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహ్మారెడ్డి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, డీఐలు తదితర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జోరు పెంచుకున్న బైపాస్

-పర్యవేక్షించిన ఎమ్మెల్యే రోహిత్

-గౌతాపూర్ టూ క్యాంప్ ఆఫీసు వరకు వేగవంతం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :
ఆరేండ్లుగా నానుతున్న తాండూరు బైపాస్ రోడ్డు పనులకు కదలిక వచ్చింది. గౌతాపూర్ నుంచి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వరకు బైపాస్ పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురానున్నారు. సుమారు 8 కిలోమీటర్ల మేరకు ఈ డబుల్ రోడ్డు ప్రక్రియ వేగం పుంజుకుంది. కొడంగల్ రోడ్డు నుంచి కోకట్ మీదుగా క్యాంప్ ఆఫీసు వరకు సాగే పనులలో కొంత జాప్యం జరుగవచ్చు. ఎందుకంటే బామ్లానాయక్ తండా వద్ద రైల్వే ట్రాక్ ఉన్నందున ఆర్‌వోబీ నిర్మించాల్సి ఉంటుంది. రైల్వేశాఖ నుంచి క్లియరెన్స్ వచ్చినా బ్రిడ్జ్ నిర్మాణానికి కొంత సమయం పడుతుంది. ఈలోగా ఒకవైపు బైపాస్ పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆర్‌అండ్‌బి అధికారులపై ఒత్తిడి పెంచారు. సోమవారం ఆయన రోడ్డు పనులను పరిశీలించారు. పనులలో ఆలస్యం కూడదని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్ కూడా పనులను గాడిలో పెట్టారు. రూ.80 కోట్ల వ్యయంతో బైపాస్ పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఆరేండ్లలో నిర్మాణ వ్యయం అంచనాలు పెరిగాయి. ఒకసైడ్ బైపాస్ రోడ్డు పూర్తయితే తాండూరు పట్టణంలో ట్రాఫిక్, కాలుష్యం సమస్య చాలా వరకు దూరమవుతుంది. గతంలో బిల్లుల చెల్లింపు సవ్యంగా జరుగనందున కాంట్రాక్టర్ వెనకంజ వేశారు. ఇప్పుడు బడ్జెట్ సమావేశాలు కూడా సమీపిస్తున్నందున సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నారు. ఈ రోడ్డుతో పాటు చెన్గేష్‌పూర్ రోడ్డు పనులకూ మోక్షం లభించింది. తాండూరు మండలం జినుగుర్తి రోడ్డు దాదాపు పూర్తి కావచ్చినందున ప్రజలు సంబరపడుతున్నారు. తాండూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ప్రధానంగా రోడ్ల సమస్య నెలకొంది. కరణ్‌కోట నుంచి గౌతాపూర్ రోడ్డు పనులు కూడా చేపట్టనున్నారు. తాండూరు నుంచి వికారాబాద్ ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్ ఈ ప్రధాన రహదారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు 70 శాతం పనులు చేపట్టారు. మరో రెండు లేయర్ల బీటీ పనులు చేపట్టాల్సి ఉందని అంటున్నారు. దాంతో పాటు అనంతగిరి హిల్స్‌లో రహదారి విస్తరణ చేపట్టాలి. ఈ రహదారిపై వంతెనల నిర్మాణం పూర్తయిందున వర్షాకాలంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా రవాణా సాగింది. రోడ్డు విస్తరణ కూడా పూర్తయితే ప్రయాణం సాఫీగా సాగుతుందని అంటున్నారు.

## పారదర్శకంగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు

- విద్యార్థుల పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు ఉండవు

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

తాండూరు, జనవరి 24, ప్రభాతవార్త :
ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగానే కొనసాగుతాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. ఇందులో ఎలాంటి అక్రమాలకు తావుండదని స్పష్టం చేశారు. మంగళవారం స్వగ్రామం తాండూరు మండలం కోట్‌బాస్పల్లిలో మంత్రి సోదరుడు నిర్వహించిన ఎల్లమ్మ దేవాలయ ఉత్సవాలకు మంత్రి హజరయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో అక్రమాలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పతోన్నతులను పారదర్శకంగా కొనసాగుతాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారానే బదిలీలు, పదోన్నతుల పక్రియ కొనసాగుతుందని వివరించారు. ఇందులో ఎలాంటి అక్రమాలకు తావుండదని స్పష్టం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 26వేల మంది ఉపాధ్యాయులు ఉండగా మొదటి విడతలో 10వేల మందికి పదోన్నతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల వార్షిక పరీక్షలకు, బోధనలకు ఎలాంటి ఆటంకాలు ఉండవని తెలిపారు. స్పౌజ్ బదిలీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు సమయం పడుతుందని వెల్లడించారు. మరోవైపు తాండూరులో కొనసాగుతున్న అధికార పార్టీ వర్గపోరుపై మంత్రిని అడుగగా.. తాండూరులో ఎలాంటి వర్గపోరు లేదని, అందరు బిఆర్ఎస్ పార్టీకి కలిసి పనిచేస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గా మధ్య ఆధిపత్యపోరును వారే సరిదిద్దుకుంటారని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాస్‌చారి, పట్టణ అధ్యక్షులు అప్పు (నయ్యూం) తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి.

## గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్

-తొలిసారిగా నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీశ్, పాల్గొన్న అదనపు కలెక్టర్లు,అధికారులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 24, ప్రభాతవార్త
భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, సంబంధిత జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సూచించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా సంబంధిత అధికారులతో గణతంత్రదినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్షా సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ నెల 26న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగ నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన పనులను బాధ్యతాయుతంగ నిర్వహించాలని అన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున మైదానంలో పెరేడ్ ఉంటుందని జిల్లా కలెక్టర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించి సభావేధిక, అలంకరణ, ప్రోటోకాల్ ప్రకారం విఐపిలు, మీడియా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థుల కోసం అవసరమైన షామియాన, కుర్చీలు, బారికేడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. శామీర్‌పేట మండలంలో ఉన్న నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో తొలిసారిగ గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకోవటం జరుగుతుందని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిఆర్‌ఓ లింగ్యానాయక్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-మున్సిపల్ చెర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చెర్మన్, కౌన్సిలర్

**కొడంగల్,జనవరి 24ప్రభాతవార్త**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సది వ్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చెర్మేన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి,మున్సిపల్ రెండవ వార్డు కౌన్సిలర్ ఆర్.మధుసుదన్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు.మంగళవారం మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమంపై ఇంటింటికి తిరుగుతు కరపత్రాలను పంచుతు ప్రజలకు అవగామన కల్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు మనిషికి జ్ఞానేంద్రియాల్లో కళ్ళు ఎంతో ముఖ్యమని కళ్ళతోనే సమాజాన్ని చూడగలుగు తామని అలాంటి కళ్ళను కాపాడుకోవాలన్నారు.ప్రభుత్వం ఎంతో వ్యవప్రయాసాలకోర్చి కంటి వెలుగు కార్యక్రమంతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు,కళ్ళ అద్దాలను అందించడం జరుగుతుందన్నారు.అంతేగాక అవసరమైన వారికి ఉచితంగా కంటి అపరేషన్‌లు కూడ చేయించడం జరుగుతుందన్నారు.ఇందుకుగాను కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి,మున్సిపల్ అధికారులు భరత్,మాజీ సర్పంచ్ రమేష్‌బాబు,బీఆర్ఎస్ నాయకులు కేవీ.రాజేందర్,అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయ నిర్మాణానికి వార్డుసభ్యురాలు రూ.50 వేలు విరాళం



దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న చౌదరిగూడ వార్డుసభ్యురాలు కుర్ర స్వాతి వేగానంద్‌గౌడ్

**ఘట్‌కేసర్, జనవరి 24, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని ఓయూకాలనీలో నిర్మించ తలపెట్టిన శ్రీవినాయక దేవాలయానికి 5వ వార్డు సభ్యురాలు కుర్ర స్వాతి వేగానంద్‌గౌడ్ రూ.50,000లు అందజేశారు. మక్తా గ్రామంలోని తన నివాసంలో దేవాలయ నిర్మాణదారులకు ఆమె చేతుల మీదుగా రూ.50 వేలు నగదును గుడి నిర్మాణానికి విరాళం ఇచ్చారు. ఓయూకాలనీలో గణేశుని ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. కాలనీ నాయకులు ఎస్.ఎస్.రెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### తుర్కపల్లిలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం



తుర్కపల్లిలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కొండగట్టుకు వెళ్తుండగ ఘనస్వాగతం పలికిన జనసేన నాయకులు, అభిమానుల దృశ్యం

**శామీర్‌పేట, జనవరి 24, ప్రభాతవార్త**

కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామిని దర్శించుకుని, వారహి ప్రత్యేక పూజలో పాల్గొనటానికి వెళ్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు తుర్కపల్లి గ్రామంలో జనసేన నాయకుల, అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం నగరం నుంచి ఆయన కాన్వాయ్‌గ శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి రాజీవ్‌రహదారిన కొండగట్టుకు బయలు దేరారు. అయితే తుర్కపల్లి గ్రామం వద్ద జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి ఘనంగ స్వాగతం పలికారు. పవన్‌కల్యాణ్‌కు గజమాల పూలదండ వేసి ఘన స్వాగతం పలికారు. తుర్కపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు మేడ్చల్ నియోజకవర్గంకు చెందిన పలు ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుకుని ఘనంగ స్వాగతం పలికారు. తుర్కపల్లి గ్రామంలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగ స్వాగతం పలికినందుకు పవన్‌కల్యాణ్ దన్యవాదాలు తెలియజేశారు. ఆ తరువాత కొండగట్టుకు పవన్‌కాల్యాన్ కాన్వాయ్‌గ బయలు దేరారు. తుర్కపల్లి గ్రామంలో స్వాగతం పలికిన వారిలో పార్టీ నాయకులు, అభిమానులు సుమంత్, నారాయణ, శివ, షహీద్, వాహబ్, రాజేశ్, గణేశ్, లక్ష్మణరావు, షేక్ ఇబ్రహీం, విష్ణుసాయి, పలువరు నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరం

-మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్ యాదవ్

**కొడంగల్,జనవరి 24ప్రభాతవార్త**

ఆత్మ రక్షణ కోసం బాలికలు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని మున్సిపల్ కౌన్సిలర్ మదుసుదన్‌యాదవ్ అన్నారు.మంగళవారం కొడంగల్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినిలకు కరాటే క్లాసులను ప్రారంభించారు.కార్యక్రమానికి హజరైన ఆయన మాట్లాడుతూ....సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం హర్షణీయమని,తమను తాను రక్షించుకునేందుకు కరాటే నేర్చుకోవాలన్నారు.కరాటే నేర్చుకోవడంతో మానసికోల్లాసంతో పాటు ఆత్మ రక్షణకు దోహదపడుతుందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రవంతి,కరాటే మాస్టర్ కరీం తదితరులు ఉన్నారు.



కరాటే క్లాసులను ప్రారంబిస్తున్న కౌన్సిలర్

# అధికారుల గైర్హాజరుపై మండిపడిన సభ్యులు

### -వాడీవేడిగా యాలాల మండల సర్వసభ్య సమావేశం

**యాలాల జనవరి 24,ప్రభాతవార్త :**

మంగళవారం ఎంపిపి తాల్లపల్లి బాలేశ్వర్ గుప్తా అద్యక్షతన యాలాల మండల సర్వసభ్య సమావేశం జరిగింది.ఎప్పటిలాగేవిద్యుత్,ఆర్అండ్‌బి,ఇరిగేషన్,ఉపాధి హామీ,ఆర్‌టిసి,మండల పరిషత్ తదితర శాఖల అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి దుమ్మా కొట్టారు.మరి కొన్నిశాఖల అధికారులు తమ శాఖలోని కింది స్థాయి సిబ్బందిని సమావేశానికి పంపించారు.ప్రజా సమస్యల వేధికైన మండల సర్వసభ్య సమావేశాలను అధికారులుతేలికగా తీసుకోవడం పట్ల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు.సమావేశానికి దుమ్మా కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండాసమావేశానికి హాజరయ్యే ఆ కొద్దిపాటి శాకల అధికారులు కూడా అరకొర సమాచారంతో రావడం ఏమిటని సభ్యులు మండిపడ్డారు.కీలక శాఖల అధికారులు ప్రజాప్రతినిధులను చిన్న చూపు చూస్తూ సమావేశాలను లైట్‌గా తీసుకుంటున్నారని సభ్యులు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.తమ శాఖల పరిధిలో పరిష్కారమయ్యే ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని సభ్యులు అధికారుల తీరును నిరసించారు.ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులువిడుదల చేయకుండా సర్పంచులను ఆగం చేస్తున్నదని మెజార్టీ సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.జిపిల్లో కనీసం కార్మికుల వేతనాలు చెల్లించని దయనీయ స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.నిధుల విడుదల రాష్ట్ర వ్యాప్తంగా ఉందని అర్థం చేసుకోవాలని ఎంపిపి సముదాయించారు.ఐసిడిఎస్‌లో ఖాలీలను భర్తి చేయడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు.బాత్‌రూంలు నిర్మాణం చేసుకున్న లబ్దిదారులకు బిల్లులు చెల్లించాలని సభ్యులు కోరారు. అటవీశాఖ సెక్షన్ అధికారి ఖాజా మొయినోద్దీన్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి.పోడు భూముల విషయంలో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,అడవి భూములు ఆక్రమనకు గురైతున్నాయన్నారు.నాయకుల



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా

వత్తిడి కారణంగా అడవి భూములు అన్యాక్రాంతమవుతున్నాయని సమావేశంలో పేర్కొనడంతోమాజీ ఎంపిపి కరణం పురుషోత్తంరావు,సర్పంచులు,ఎంపిటిసిలు అభ్యంతరం వ్యక్తం చేశారు.సమావేశం పరిధిలోని అంశాలను మాత్రమే మాట్లాడాలని వారు సదరు అధికారికి చురకలు వేశారు.మూడు మాసాలకోసారి ప్రజా సమస్యలపై చర్చించేందుకు వేదికైన మండల సర్వసభ్య సమావేశాలకు ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ,జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌లతో పాటు ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు హాజరైతే కొద్ది పాటి ప్రజా సమస్యలకైనా మోక్షం లభిస్తోందని సభ్యులుఅభిప్రాయం వ్యక్తం చేశారు.మండల స్థాయి అధికారులతో అరవడం తప్ప ఒరిగేదేమీ ఉండదని పలువురు సభ్యులు పేర్కొనడం కొసమెరుపు.ఇదిలా ఉండగామండల స్థాయి అధికారులు జవాబుదారితనందో విధులు నిర్వర్తించాలని ఎంపిపి సూచించారు.తమ పరిధిలో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించకుండాతాత్సారం చేయడం తగదన్నారు.ఇలాంటివి పునారావృతం అయితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ రాజుగౌడు,వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎదులాబాద్ గ్రామసభలో గందరగోళం..రసాభసా

### -అవకతవకలపై ప్రజల నిలదీత..సభ రద్దు
### -కార్యదర్శిపై మహిళ దాడికి యత్నం..పోలీసులకు ఫిర్యాదు

**ఘట్‌కేసర్, జనవరి 24, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో మంగళవారం జరిగిన గ్రామసభ రసాభసా కావడంతో రద్దు అయ్యింది. గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ కాలేరు సురేశ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సభలో ప్రజాప్రతినిధులకు రెండునెలల ఆదాయ, వ్యయాల వివరాలను తెలియజేశారు. గ్రామ పంచాయతీలో అక్రమాలు జరుగుతున్నాయన్న అభియోగంపై సర్పంచ్, కార్యదర్శిలు వివరణ ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. నకిలీ అనుమతి పత్రాలు, రశీదులు సృష్టిస్తున్నారని, ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు తీసుకొని రశీదులు సరిగా ఇవ్వడం లేదని పలువురు వార్డుసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులకు సంబంధించి వసూలు చేసిన డబ్బులను సబ్‌ట్రెజరీలో జమ చేయకుండా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల మూత్రశాల స్థలాన్ని అమ్ముకొని వచ్చిన రూ.4 లక్షలతో ఏమి చేశారని రాజేందర్ ప్రశ్నించారు. దీనిపై సర్పంచ్ సురేశ్ స్పందిస్తూ ట్రాన్స్‌ఫర్మర్, బస్తీదవాఖానాలో సౌకర్యాలు తదితర పనులు చేశామని వివరణ ఇచ్చారు. అవినీతి, అక్రమాలతో పంచాయతీకి నష్టం కల్గుతుందని, నిధులతో గ్రామంలో గ్రంధాలయ భవనం నిర్మించాలని మాజీ ఎంపిటిసి మంకం రవి డిమాండ్ చేశారు. పంచాయతీ రికార్డులు సీజ్ చేయగా గ్రామసభ ఏలా నిర్వహిస్తారని ప్రజలు ప్రశ్నించారు. ఇంటిపన్నులు వసూలు చేయడానికి వచ్చిన గ్రామకార్యదర్శి ఉష తమ కొడుకుతో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని పూస లక్ష్మిబాయి సభలో నిరసన వ్యక్తం చేస్తూ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ముందు కార్యదర్శి ఉష చీరలను లాగారు. దీంతో నాయకులు అడ్డుకొని ఆమెను పక్కకు తప్పించారు. ఎంపిపి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని అవకతవకలకు ఆస్కారం లేకుండా పరిపాలన ఉండా




ఎదులాబాద్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

లని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామసభలో వాగ్వివాదాలు చోటుచేసుకొని గంధరగోళం కాగా ప్రజాప్రతినిధులు బయటకు వెళ్లగా సభను రద్దు చేశారు. కార్యదర్శి ఉష మనస్థాపం చెంది గ్రామసభ నుంచి వెళ్లిపోయి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మిబాయి తనను గ్రామస్తుల సమక్షంలో భూతుమాటలు తిడుతూ గోర్లతో దాడి చేసిందని ఉపసర్పంచ్ లింగేశ్వరరావు, వార్డుసభ్యులు శ్రీనివాస్, అంజనేయులు, నాయకులు ఆరుట్ల బాల్‌రాజ్‌లు గత వారం రోజులుగా లక్ష్మిబాయిని రెచ్చగొట్టి తనపై దాడికి ఉసిగొల్పారని కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

గ్రామసభలో ఎంపిటిసి సభ్యులు కందుల సరళ, గట్టగళ్ల రవి, కోఆప్షన్ సభ్యులు ఎండి.ఇక్బాల్, ఉపసర్పంచ్ ఉప్పు లింగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు మంకం రవి, కందుల కుమార్, వార్డుసభ్యులు చుక్కల రాంచందర్, గుండ్ల అంజనేయులు, ఎర్రోళ్ల శ్రీనివాస్, పూస నందకుమార్, బేలె సురేశ్, భర్తకు గణేశ్, అంజమ్మ, మీరాబాయి, కోఆప్షన్ సభ్యులు నాగరాజు, సహకార సంఘం డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు యుగంధర్‌గౌడ్, నాయకులు బట్టె లక్ష్మణ్‌రావు, మెంగ బాలక్రిష్ణ, ప్రవీణ్‌రెడ్డి, ఆరుట్ల బాల్‌రాజ్, రాజేందర్, సామల అమర్, నవీన్, మల్లికార్జునరాజు, నర్సింహ్మా, పెంటాజీ, శ్రీశైలం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినిలకు కరాటేలో శిక్షణ

**వెల్దుర్తి, జనవరి 14 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినిలకు మంగళవారం కరాటే శిక్షణ తరగతు లను మండల విద్యాధికారి యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వడానికి అనుమతి ఇవ్వడం జరిగిందని, బాలికలకు నెల రోజుల పాటు పాఠశాలలో కరాటే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ బాలికలకు కరాటే శిక్షణ తరగతులు నిర్వహించడం సంతోషకరమన్నారు. నెల రోజుల పాటు కరాటే శిక్షణ తరగతుల్లో బాలికలకు పాఠశాల పీడీ ప్రతాప్ సింగ్ రాథోడ్ (బ్లాక్ బెల్ట్) శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో 190 పాఠశాలలకు కరాటే శిక్షణకై అనుమతి వచ్చిందని పాఠశాల పీడీ ప్రతాప్ సింగ్ తెలి పారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకై...
### మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మ హామీకి కృతజ్ఞతలు...

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 24, ప్రభాతవార్త :**

రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకై కొంతకాలంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపడుతున్న మలిదశ ఉద్యమానికి సానుకూలంగా స్పందించి, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషిచేస్తామని హామినిచ్చిన రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీష్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికు అఖిలపక్షం నాయకులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లా డుతూ రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు మంత్రి హరీష్‌రావు,ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు సానుకూలంగా స్పందించారని, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో శుభవార్త అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేష్‌రెడ్డి, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, సుంకోజు దామోదర్, అల్లాడి వెంకటేష్, పలువురు ఉన్నారు.

### వార్షికోత్సవాలకు ముస్తాబైన భ్రమారంబిక మల్లికార్జున స్వామి దేవాలయం

**వెల్దుర్తి, జనవరి 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ వద్ద వెలసిన శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయ 45వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వార్షికోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుండి 27వ తేదీ వరకు కొనసాగనున్నాయని తెలిపారు. తెలంగాణ కాశీగా పేరొందిన భ్రమారంబిక మల్లికార్జున స్వామి దేవాలయం వార్షికోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడి ఆలయ కొనేరులో స్నానం ఆచరిస్తే ఆరోగ్యంగా ఉంటామని భక్తుల నమ్మకం. ఈ నెల 25న కుకునూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుండి భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం వరకు జెండా ఊరేగింపు, అనంతరం గణపతి పూజ , పుణ్యాహవచనం, అఖండ దీపారాధన తదతర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26న ప్రధాన దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, భ్రమారంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణోత్సవం, పల్లకి సేవ, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, 27న రథోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షులు తలారి మల్లేశం తెలిపారు. మాధవానసంద సరస్వతి ఆధ్వర్యంలో పురోహితులు లక్ష్మీకాంతశర్మ, రఘువీరశర్మ, వైదిక నిర్వహణ రామదత్త శర్మ, వెంకటేశ్వరశర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు. పరిసర ప్రాంత ప్రజలు పాల్గొని వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

### రోగులకు ,వైద్యులకు సహాయం చేయడమే లక్ష్యం

నాగారం జనవరి24,ప్రభాతవార్త : సృజనాత్మకత ఆధారంగా పనిచేసే అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ సంస్థ అయిన గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కీమోథెరపీ వల్ల వచ్చే వికారం,వాంతుల నివారణకు ఉపయోగించే మన దేశంలో మొట్టమొదటి ఐవీ ఇంజెక్షన్ ఫార్ములేషన్ అయిన అకిన్‌జీయో ఐవిని ఆవిష్కరించింది.స్విస్ బయో ఫార్మాగ్రూప్ కంపెనీ అయిన హెల్సిన్‌తో ఇందుకోసం ప్రత్యేకంగా లైసెన్సింగ్ ఒప్పందం చేసుకుంది.అకిన్‌జీయో ఐవి అనేది ఒక ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్,ఇందులో ఫాస్నెట్యుపిటాంట్ (235 ఎంజీ ) ఫాలోనోసెట్రాన్ (0.25 ఎంజీ) ఉంటాయి.ఇది సింగిల్ డోస్‌గా వచ్చి, డైల్యూట్ చేస్తే సిద్ధంగా ఉండే ఐవీ ఇంజెక్షన్ దీన్ని కీమోథెరపీ సైకిల్ ప్రారంభానికి 30 నిమిషాల ముందు ఇవ్వాలి అప్పుడు తీవ్రంగా,ఆ తర్వాత కూడా వచ్చే వాంతులు,వికారాన్ని నివారిస్తుంది. బిజినెస్ హెడ్ అలోక్ మాలిక్ మాట్లాడుతూ...క్యాన్సర్ చికిత్సలో రోగులకు వైద్యులకు సహాయం చేయడానికి గ్లెన్‌మార్క్‌లో మేము సిద్ధంగా ఉన్నామని

### బోదకాలును పారదోలుదాం

**జిల్లా మలేరియా అధికారి కుమారస్వామి**

**చిన్నశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోదకాలు వ్యాదిగ్రస్తులకు కిట్‌లను మంగళవారం జిల్లా మలేరియా అధికారి కుమార్‌స్వామి అందించారు. అనంతరం ఈ కిట్ల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు ఎక్కువరోజులు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు.దీనివల్ల దోమలు వ్యాప్తి చెందకుండా చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయి సిందు, జిల్లా సబ్ యునిట్ అధికారి శ్రీనివాస్, సిహెచ్‌వో యాదగిరి, ఫార్మసిస్ట్ రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌లు, తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన చౌదరిపల్లి నర్సింలు గుడిసే రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు దగ్ధం అయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు, బట్టలు పంపించగా భారాస పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు మంగళవారం వారి కుటుంబానికి అందించారు. నర్సింలుకు రెండు పడుకగదుల ఇళ్లు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మి, మంచాల లక్ష్మణ్, నాయకులు హెమ చంద్రం, ప్రభాకర్, మెట్టు గణేష్, దుర్గపతి, ఇమ్మడి నరేష్, నాగరాజు తదిరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉద్యోగ కల్పనలో సహాయపడుతుంది

శామీర్ పేట జనవరి24,ప్రభాతవార్త : కృత్రిమ మేధస్సు,బిగ్ డేటా మరియు కోడింగ్,ప్రోగ్రామింగ్ వంటి భవిష్య టెక్ డొమైన్స్‌లో యువతకు అదనపు నైపుణ్యాలు బోదించడానికి మరియు వారికి సంబంధిత ఉద్యోగ కల్పనలో సహాయపడటానికి శామ్‌సంగ్ ఇండియా తమ శామ్ సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ సిఎస్ఆర్ ప్రోగ్రాంను హైదరాబాద్‌లో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మరియు కరీంనగర్‌లో ఎస్ఆర్ఆర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్,సైన్స్‌లో దీనితో యువత మరియు పవరింగ్ డిజిటల్ ఇండియాకు సాధికారత కల్పించే తమ మిషన్‌లో తెలంగాణలో భారత ప్రభుత్వంతో పాటు శక్తివంతమైన భాగస్వామిగా శామ్‌సంగ్ తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది.కోర్స్‌లు 18 నుండి 20 సంవత్సరాల మధ్య వయస్సు విద్యార్థులకు అందించబడుతున్నాయి.వారికి తమ సంబంధిత క్యాంపస్‌లలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మరియ ఎస్ఆర్ఆర్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్,సైన్స్‌సలలో ప్రొఫెసర్స్ భోధిస్తారని వెల్లడించింది.

### మొగి పురుగు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**చిన్నశంకరంపేట, జనవరి 24, ప్రభాతవార్త:** రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా 9800 ఎకరాల వరి పంటను వేశారని వ్యవసాయాధికారి లక్ష్మి ప్రవిణ్ తెలిపారు. మంగళవారం ఖాజాపూర్, కొర్విపల్లి, సూరారం గ్రామాలలోని వరి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో వరి పంటలను రైతులు తొందరగా వేయడం వలన పంటకు మొగి పురుగు వ్యాది ఎక్కువగా వ్యాప్తీ చెందు తుందని, పంట పోలాలలో యూరియా అధికంగా వాడిన పొలంలో ఈ వ్యాది తీవ్రత ఎక్కువగా ఉంటుందని అన్నారు. వ్యాధి నివారణ కార్టప్ హైడ్రో క్లోరైడ్ మందును లీటర్ నీటిని 2 గ్రాముల చోప్పున పిచికారి చేయాలని సూచించారు. మొక్కజోన్న పంటపై వ్యాప్తి చెందే కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిమ్ బెంజోమెట్ ద్రావణాన్ని 1 లీటర్ నిటికి 1 ఎమ్ఎల్ మిశ్రమాన్ని కలిపి పిచికారి చేయాలని అన్నారు. ఆయన వెంట వ్యవయసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, శ్యాం కుమార్ నాగెంద్రబాబు రైతులు ఉన్నారు.

### డీలర్లకు ఎరువుల ఆన్‌లైన్ విదానంపై అవగాహన

**నర్సాపూర్, జనవరి 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలోగల రైతువేదికలో మంగళవారం నర్సాపూర్, కౌడిపల్లి వ్యవసాయ శాఖ డివిజన్‌ల పరిధిలోని ఎరువుల డీలర్లకు ఎరువుల ఆన్‌లైన్ విదానం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ అవగాహన కార్యక్రమంలో ఎరువుల డీలర్లకు ఆన్‌లైన్ ఎరువుల విదానం వ్యవసాయాదికారులు క్లుప్తంగా వివరించడం జరిగింది. రైతులకు ఎరువులు ఏవిదంగా ఇవ్వాలో తదితర విషయాలపై ఎరువుల డీలర్లకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ నర్సాపూర్ ఏడిఎ సురేఖ, కౌడిపల్లి ఏడిఎ పద్మ,ఏఓ మెదక్ టెక్నికల్ హర్ష,ఏవోలు తూప్రాన్ గంగమల్లు, శివ్వంపేట ఏవో రమాదేవి, మనోహరబాద్ ఏవో ం పాల్గొన్నారు.

## కరాటే మాస్టర్‌ల నియామకంలో నిబంధనలు పాటించాలి

**కొడంగల్,జనవరి 24ప్రభాతవార్త**

పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్ కరాటే క్లాసుల నిర్వహణలో భాగంగా కరాటే మాస్టర్‌ల నియామకంలో నిబంధనలు పాటించాలని కరాటే మాస్టర్ చిట్లపల్లి శ్రీనివాస్ అన్నారు.మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు హైస్కూల్‌లలో ప్రధానోపాద్యాయులు కరాటే ప్రోగ్రాం వచ్చిన నివేదికను పత్రికల్లో ప్రకటించి కరాటే మాస్టర్‌ల నియామకం చేపట్టాలన్నారు.ప్రభుత్వం ఇచ్చిన ఒకనెల మార్షల్ ఆర్ట్స్ ప్రోగ్రాంని ప్రతి హైస్కూల్‌ల్లో బాలికలకు కరాటే నేర్పించేందుకు గాను కరాటే మాస్టర్‌ను నియమించే ముందు కరాటే మాస్టర్ బయోడేటా తీసుకోవాల్సి ఉంటుందన్నారు.అంతేగాక నియమించబడే కరాటే మాస్టర్‌కు అనుభవం తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుందన్నారు.ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో మహిళా కరాటే మాస్టర్‌ను నియమిస్తే ముమ్ముందు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు.

## ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

### -బాల్యవివాహాలను నివారించాలి: ఎంఇఓ
### -ఆత్మరక్షణకు కరాటే ప్రారంభం



ఎదులాబాద్‌లో జాతీయ బాలికా దినోత్సవంలో పాల్గొన్న ఎంఇఓ శశిధర్, ఎస్ఓ హేమలత తదితరులు

**ఘట్‌కేసర్, జనవరి 24, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పథకాలు బాలికలకు తోడ్పడేందుకు తల్లిదండ్రుల సహకారం అవసరమని ఘట్‌కేసర్ ఎంఇఓ శశిధర్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ ఇంచార్జ్ ఎంఇఓ శశిధర్ ముఖ్యఅతిధి విచ్చేసి పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం జాతీయ బాలికల అభివృద్ధి మిషన్ పేరుతో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ద్వారా 2008 జనవరి 24 నుంచి జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. సమాజంలో బాలికల సంరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి, బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్యా, సామాజిక ఎదుగుదల అంశాలపై జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటారని పేర్కొన్నారు. లింగనిర్దారణ పరీక్షలు నిషేధమని, భ్రూణహత్యలు, బాల్యవివాహాలు చేస్తే శిక్షకు గురవుతారని తెలిపారు. ఆడపిల్లలను చదువుల్లో క్రీడల్లో ప్రోత్సహించాలని అందరి సహకారం అవసరమన్నారు. బాలికల రక్షణ కోసం కరాటే క్లబ్‌ను ప్రారంభించారు. కరాటే మాస్టర్ విద్యార్థినులతో కరాటే సాధన చేయించారు. బాలికలు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈసందర్భంగా జీవితంతో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్ఓ హేమలత, ప్రధానోపాధ్యాయురాలు పి.సరస్వతీ, మరియా, ఎస్ఎంసీ చైర్మన్ ఆర్.బాలకిషన్, వైస్‌చైర్మన్ రేణుక, పాఠశాల పూర్వవిద్యార్థిని మమత, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.1.10 కోట్లు మంజూరు

-గ్రామాలాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు: ఎంపిపి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జనవరి 24, ప్రభాతవార్త:**

మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఘట్‌కేసర్ మండలానికి రూ.1.10 కోట్లు మంజూరు అయ్యాయని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారిగా ఎన్ఆర్ఇజిఎస్ కింద నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేశారని వీటితో డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలు, రైతువేదికలు, పాఠశాలల అభివృద్ధి చేస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామాల వారిగా జరుగుతున్న పనులపై ఆయన ఎంపిడిఓ అరుణ, ఏఇలు వెంకట్‌రెడ్డి, జగపతితో సమీక్ష జరిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా ప్రజాప్రతినిధులను విస్మరిస్తుందని ఆయన విమర్శించారు. సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు నిధులు మంజూరు చేయకుండా బీఆర్ఎస్ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తుందని పేర్కొన్నారు. మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలోని 61 గ్రామాలకు నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. కేంద్రాం ద్వారా జిల్లాఓని 61 గ్రామాలకు రూ.6.50 కోట్లు విడుదల అయ్యాయని కేంద్ర పథకాలను, నిధులను బీఆర్ఎస్ సర్కారు పక్కదారి పట్టించి ప్రజలను మోసం చేస్తుందని ఎంపిపి ఆరోపించారు.

## కంటి వెలుగును విజయవంతం చేయాలి

-ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**మనోహరాబాద్, జనవరి 24 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసు కొని విజయవంతం చేయాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం కొండాపూర్‌లో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మనోహరా బాద్ ఎంపీపీ పురం నవనీత రవి, రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్, మనోహరాబాద్ సర్పంచి మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పురం మహేష్, కొండాపూర్ సర్పంచి పాల్గొన్నారు

### మహిళలకు నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యం

నాగారం జనవరి24,ప్రభాతవార్త : గ్రామీణ,పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలకు సాధికారత కల్పించేందుకు ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ మద్దతుతో ఒప్పో ఇండియా మరియు సీఎస్‌సి అకాడమీ సంయుక్తంగా సైబర్ సాంగిని ప్రోగ్రామ్‌ను ప్రారంభించాయి.సైబర్ సెక్యూరిటీ సైబర్ వెల్‌నెస్‌లో 10వేల మంది మహిళలకు శిక్షణనిచ్చే ఈ కార్యక్రమం ద్వారా,వారు సర్టిఫైడ్ సైబర్ సెక్యూరిటీ అంబాసీడర్‌లుగా మారేందుకు కావలసిన నైపుణ్యాలు,పరిజ్ఞానాన్ని అందించాలని ఈ సంస్థలు లక్ష్యాన్ని పెట్టుకున్నాయి.ఈ 45 రోజుల కోర్సు పూర్తి చేసిన వారు ఎన్ఐఈఎల్ఐటి నుంచి ఒక సర్టిఫికెట్‌ను అందుకుంటారు.అది వారి ప్రాంతాలలో ఉపాధి మరియు జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది.సైబర్ దాడుల నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రతి పౌరునికి అందుబాటులో ఉన్న ప్రస్తుత చట్టాలు,నియమ నిబంధనలు గురించి సైబర్ సంగినీలకు శిక్షణ ఇస్తారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మకు బోనాలు

**నర్సాపూర్, జనవరి 24.ప్రభాతవార్త:** మండలపరిధిలోని నత్నాయపల్లి గ్రామంలో నాలుగురోజుల నుండి శ్రీమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జాతరలో బాగంగా చివరిరోజు మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మదేవికి ఘనంగా బోనాలను ఊరేగించారు. ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మా రెడ్డి వేరువేరుగా పాల్గొని మల్లికార్జునస్వామికి పూజలు నిర్వహించారు. జాతరలో గంగపటం, శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణం, అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు, నాగ వెల్లి తదితర కార్యక్రమాలను గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్దలతో జరుపు కున్నారు. చివరిరోజు శ్రీరేణుక ఎల్లమ్మదేవికి సామాహిక బోనాలు ఊరే గించి ఒడిబియ్యాని సమర్పించి తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈమేరకు నత్నాయపల్లిలో గత నాలుగు రోజుల నుండి శ్రీ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్యాట సాయమ్మ సత్యనారాయణ, ఎంపిటీసి గాయిత్ర, ఉప సర్పంచ్ విష్ణు, సిపిఐ మండల కార్యదర్శి జాజాల దుర్గయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలతో ఇంటి కళ మారుతుంది



ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ లక్ష్మీసుధ నర్సింహులు

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 24,(ప్రభాతవార్త):**
ఇంట్లో ఆడపిల్లలు ఉండడం వల్లన ఆ ఇంటి కళ పూర్తిగా మారిపోతుందని జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామ సర్పంచ్ లక్ష్మీసుధ నర్సింహులు అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి కేంద్రం ఆద్వర్యంలో బేటి బచావో బేటి బడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ నేటి సమాజంలో కొంత మంది ఆడబిడ్డలు పుడితే ఇబ్బందులు పడుతున్నారు. కాని సృష్టికి మూలం ఆడది అలాంటి ఆడపిల్లలను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. స్త్రీ, పురుషులను ప్రతతి ఒక్కరు సమానం చూడాలని తెలిపారు. స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని వారికి ప్రోత్సహం అందిస్తే మరింత ముందుకు సాగుతారని అన్నారు. స్త్రీలకు ఓపిక ఎక్కువ ఉంటుందని వారు తలుసుకుంటే ఎంతటి ఆపజయాన్నైన విజయంగ మారుస్తారని అన్నారు. విద్యా, క్రీడ, రాజకీయ రంగాల్లో స్త్రీలకు సముచిత స్థానం కల్పించాలని ఆమె తెలిపారు. తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని ఆమె అన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయవద్దని యుక్త వయస్సు వచ్చాకే పెళ్లి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులు, విద్యార్థులు బేటి బచావో, బేటి బడావో అంటు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాములు, పంచాయితీ కార్యదర్శి ధీరజ్, ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, అంగన్‌వాడి కార్యకర్త ఊర్మళ రఘురాములు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి

**-శివాలయానికి రూ.1 లక్ష పదకొండు వేలు విరాళం**
**-బుగ్గోనిగూడలో వీర్లపల్లి శంకర్ పూజలు**



బుగ్గొని గూడ శివాలయ పూజల్లో పాల్గొన్న వీర్లపల్లి శంకర్

**నందిగామ జనవరి24,ప్రభాతవార్త :**
దేవాలయాలు మనకు ధర్మాన్ని నెర్పిస్తాయని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలమర్చుకోవాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి,షాద్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జీ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం నందిగామ మండలం బుగ్గోనిగూడ గ్రామ పరిధిలో కొత్తగా నిర్మించిన శివాలయానికి రూ.1లక్షా 11వేలు విరాళం ఇచ్చి ఆలయంలో పూజలు చేశారు.ఈ సందర్భంగా వీర్లపల్లి మాట్లాడుతూ... మానవసేవయే మాధవసేవ అని,సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు.ప్రజలందరికి మంచి జరిగేలా దీవించమని వేడుకున్నట్లు చెప్పారు.మూడు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దేపల్లే కుమార్ గౌడ్,మాజీ సర్పంచ్ కావలి కృష్ణా,కాంగ్రెస్ సీనియర్ నేత పసుల బుచ్చయ్య,మంకాల శ్రీశైలం,సతీష్ పటెల్,పసుల పాండు,సములయ్య,సతీష్,రాగులపల్లి శేకర్,బుగ్గ అనిల్ ,బుగ్గ భాస్కర్,కృష్ణ,అనంతయ్య,బుగ్గ శ్రీనివాసులు,పాల్గొన్నారు.ఈ కార్యక్రమం బుగ్గ శ్రావణ్,జి.రాంచెంద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన రాస్తున్న విద్యార్థులు

**ఆమనగల్లు, జనవరి24, ప్రభాతవార్త:**
జాతీయ ఓటర్ల దినోత్సవం పురష్కరించుకుని విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గౌతమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా, కళాశాల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. మంగళవారం ప్రభుత్వ కళాశాల ఆవరణలో పోటీలు జరిగాయి. దేశ అభివృద్దిలో ఓటు పాత్ర అంశంపై పోటీలు నిర్వహించారు. గౌతమి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పు కృష్ణ మాట్లాడుతూ దేశ అభివృద్దిలో ఓటు ఎంత కీలకమో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించామని చెప్పారు. ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందజేస్తామని, ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కృష్ణ కోరారు. కార్యక్రమంలో అధ్యాపకుడు పెరుమాళ్ళ కృష్ణ తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి వేడుకలు

**ఆమనగల్లు, జనవరి24, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో గుర్రంగుట్టపై గల మార్కోండే దేవాలయంలో మంగళవారం భక్త మార్కోండేయ జయంతి ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్దల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఆమనగల్లు మండల మార్కోండేయ సంఘం, పద్మశాలి సంఘం, పద్మశాలి మహిళా సంఘంల అధ్వర్యంలో వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆలయ పూజారి ఆమనగంటి నాగభూషణ్ పూజా కార్యక్రమాలను కొనసాగించారు. మార్కోండేయ స్వామికి డోలారోహణం, జోలపాటలు, మంగళహారతులు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కోండేయ గుడి ఆవరణ పరిసరాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. జయంతి పురష్కరించుకుని ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా మార్కోండేయ జయంతి వేడుకలలో ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహకులు సుంకిరెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు అప్పం శ్రీను, అవ్వారి శివలింగం, భీమనపల్లి దుర్గయ్య, గాజుల సత్యరాములు, బావండ్ల శంకర్, అప్పం రాఘవ, మసున గిరి, మసున అప్పి, మసున శ్రీనివాస్, మామాడిశెట్టి రవి, పున్న వెంకటేష్, దోర్నాల ఈశ్వరయ్య, ఎంగలి యాదగిరి, ఎంగలి ప్రసాద్, గుజ్జరి శ్రీను, రచ్చ వెంకటేష్, అంజయ్య, వెంకటయ్య, అప్పం అలివేలు, అప్పం శ్రీలత, బావండ్ల సరిత, మాకం కవిత తదితరులు ఉన్నారు.



మార్కోండేస్వామివార్లకు పూజలు చేస్తున్న భక్తులు

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

**శంకర్‌పల్లి, జనవరి 24, ప్రభాతవార్త :**
ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ శంకర్‌పల్లి మండల నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంగళవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వర్యులు ప్రహ్లాద్ కుమార్ జోష్ ఎమ్మార్పీఎస్ శంకర్‌పల్లి మండల ఇంచార్జీ కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం తెలుగు నేలపై మాదిగలు 28సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న సందర్భంలో గల్లి నుండి మొదలుకుని ఢిల్లీ వరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంపూర్ణంగా బీజేపీ పార్టీ మద్దతు తెలిపి వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి నేటికి 8ఏళ్ల గడిచిన వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యం చేయకుండా ఈ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో తక్షణమే వర్గీకరణ బిల్లును మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారంగా ప్రవేశపెట్టే విధంగా చొరవ చూపి కేంద్ర పెద్దలు ప్రధానమంత్రి, హోంశాఖమంత్రిను ఒప్పించాల్సిందగా కేంద్ర మంత్రివర్యులను విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మొయినాబాద్ మండల కన్వీనర్ రాజుమాదిగ, శంకర్‌పల్లి మండల నాయకులు గండయ్యమాదిగ, శ్రీనివాస్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ శంకర్‌పల్లి మండల కన్వీనర్ వంశీ మాదిగ, మనోజ్ మాదిగ తదితరులు ఉన్నారు.



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ కుమార్ జోష్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## ఆధ్యాత్మిక ఉత్సవాలు..భక్తుల సంబురాలు

**-ప్రారంభమైన సాయినాథుని విగ్రహ ప్రతిష్ట వేడుకలు**

**నందిగామ జనవరి24,ప్రభాతవార్త :**
నందిగామ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిర్డీ సాయినాథుని విగ్రహా ప్రతిష్టాపన పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి.మొదటిరోజు శీతలా మాతకు,వినాయకునికి ఆలయ నిర్మాణ దాతలు పూజలు నిర్వహించారు. వాస్తుపూజ,వాస్తుహోమం,మహాగణపతి హోమం వంటివి ఈ నెల 26వరకు ప్రతిష్టాపన పూజలు కొనసాగనున్నాయి.ఈ సందర్భంగా శ్రీ శివరామాంజనేయ స్వామి ప్రధాన ద్వారంతో పాటు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గ్రామ వీధులో భక్తి పాటలు మారుమ్రోగుతుండగా,నూతన సాయినాథుని ఆలయాన్ని,ప్రధాన ద్వారాలను మామిడి తోరణాలు కట్టి పూలతో అలంకరించారు.నిత్యపూజలతో బాసిల్లుతూ భక్త జనంతోఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**ప్రారంభం వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు**

నందిగామలో నూతనంగా నిర్మించిన శ్రీ సాయినాథుని ఆలయ విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభ వేడుకలకు జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి ఆలయ నిర్మాణదాతలు తాండ్ర రామక్రిష్ణా,తాండ్ర గోపాల్ రెడ్డి,షాద్‌నగర్ ఎఎంసి మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి,ఎంపిటిసి కొమ్ము కృష్ణ,మాజీ సర్పంచ్ వి.రాంరెడ్డి,మాజీ ఎంపిటిసి దామోదర్ రెడ్డి,అడ్వకేటు,ఎం విక్రంశర్మ,మాజీ ఎంపిటిసి ఎర్ర అంజయ్య గౌడ్,బి.జంగయ్య గౌడ్,సి.నర్సింలు, పురప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జడ్పివైస్ చైర్మన్ గణేష్ మాట్లాడుతూ... ఆలయాలు మనకు ధర్మాన్ని నేర్పిస్తాయని సమాజంలో ఉత్తమంగా జీవించాలంటే ప్రతి రోజు దేవాలయాలను సందర్శించాలన్నారు.ఈ నెల 26న జరిగే శ్రీ సాయినాథుని విగ్రహ ప్రతిష్ట వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



దేవతా మూర్తులకు పూజించేందుకు బోనాలతో ఊరేగింపుగా వస్తున్న ఆలయ నిర్మాణ దాతలు తాండ్ర అవశాల్య,అర్చన దృశ్యం



ప్రారంభ వేడుకల్లో పూజల్లో పాల్గొన్న పురప్రముఖులు

## గ్రామీణ క్రీడాకారులకు ఎప్పుడు అండగా ఉంటాం

**- బిజెపి సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి**
**- పాలమూరు ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రికెట్లు పంపిణీ**



క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

**షాద్‌నగర్, జనవరి 24, (ప్రభాతవార్త) :**
గ్రామీణ ప్రాంతాంలో ఉన్న యువత క్రీడల్లో రాణించాలని అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో భాగంగా బీజేపీ సీనియర్ నాయకుడు, పాలమూరు ట్రస్ట్ చైర్మన్ పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులకు క్రికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో ఎంత నైపుణ్య దాగి ఉందని, వారికి సరియైన ప్రోత్సహం లేకనే క్రీడల్లో రాణించలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై గ్రామీణ స్థాయిలోని ప్రతి క్రీడాకారుడికి అండగా మేము నిలబడుతామని ఆయన క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా యువకల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీయడానికి ఇలాంటి టోర్నమెంట్లను నిర్వహిస్తున్న నిర్వహకులను అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కొనియాడారు. అందివచ్చిన అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో మరింత రాణించాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక గ్రామ పెద్దలు, యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తమ సర్పంచ్ దండు అర్చనసుధాకర్‌రెడ్డికి జాతీయ అవార్డు




అవార్డు అందుకుంటున్న సర్పంచ్ దండు అర్చనసుధాకర్‌రెడ్డి

**షాబాద్, జనవరి 24, ప్రభాతవార్త :**
ఉత్తమ సర్పంచ్‌గా అంబేద్కర్, పూలే ఆశయాలకు అణుగుణంగా ముందుకు సాగుతున్న దండు అర్చనసుధాకర్‌రెడ్డికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు దక్కింది. మంగళవారం నగరంలో బహుజన సాహితి అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సర్పంచ్‌గా ఉత్తమ పురస్కారం అందుకున్న దండు అర్చనసుధాకర్‌రెడ్డిని పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ విష్ణు, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నూతన వెటర్నరీ ఆసుపత్రి భవనాన్ని మంజూరు చేయాలి



ఎమ్మెల్యేను కలిసి ఆయా గ్రామాల నాయకులు

**షాబాద్, జనవరి 24, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న వెటర్నరీ ఆసుపత్రి నూతన భవనం ఏర్పాటు చేయాలని మంగళవారం ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల కాలె యాదయ్య సానూకులంగా స్పందించి నూతన భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మెన్ మల్లేష్, సర్పంచ్ రాములు, ఎంపీటీసీ మల్లేష్, మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## శివస్వాములు ఆశ్రమానికి నిధులు కేటాయింపు

**తాండూరు టౌన్ జనవరి24,ప్రభాతవార్త :** తాండూర్ పట్టణంలోని శ్రీ కోటేశ్వర దేవాలయానికి చెందిన శివ స్వాములు ఆశ్రమం కొరంకు ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిని కలిసి కొరడంతో ఆయన వెంబడే స్పందించి శివస్వాముల ఆశ్రమం కొరకు పది లక్షల రూపాయల నిధులును కేటాయించారు.ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ రావుఫ్,బీదర్ రాజ్ శేఖర్,మసుద్,బోయ రాజు,అశోక్ ముదిరాజ్,శ్రీకాంత్ రెడ్డి,శివస్వాములు,నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్ మండలంలో :** మండల పరిధిలోని చంద్రవంచ గ్రామంలో పోచమ్మ దేవాలయానికి ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్సీని కొరడంతో తనవంతు సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మాణిక్యమ్మ,మాజీ సర్పంచ్ నర్సింహులు, ఎల్లప్ప,సుందరప్ప, మహేష్,కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

## మూడవ రోజు కొనసాగిన ప్రగతి నివేదన యాత్ర



ప్రగతి నివేదన యాత్ర దృశ్యం

**యాచారం, జనవరి 24 ప్రభాతవార్త**
ప్రగతి నివేదన యాత్ర మూడవ రోజు మంగళవారం మండలంలోని నక్కగుట్ట తండా, ఎర్రగొళ్ల తండా, తక్కళ్లపల్లి తండాలో కొనసాగింది. ఈ సందర్భంగా గడప గడపకు తిరిగి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎర్రగొల్ల తండా వాసులకు బస్టాప్ వద్ద ఆర్టీసి బస్సు ఆగకుండా వెళ్తుందని తండా వాసులు పేర్కొనడంతో ఆర్టీసి డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. తక్కళ్లపల్లి తండాలో గిరిజన తల్లి కోరిక మేరకు రొట్టెలతో ప్రశాంత్‌రెడ్డి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ జగదీష్‌నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేష్‌గౌడ్, పాశ్చ భాష, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్, పిఎసిఎస్ చైర్మన్ కోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ సంతోష రమేష్, మండల గోపాల్, ఖాజా మహమ్మద్, సంగం రాజు పాల్గొన్నారు.

## చింతపట్ల పాఠశాల విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని శివానిని సన్మానిస్తున్న దృశ్యం

**యాచారం, జనవరి 24 ప్రభాతవార్త**
జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి ఇతర అధికారుల సమక్షంలో బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వేడుకలకు ఆహ్వానించి సన్మానించి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన సిద్దగోని నర్సింహ, యాదమ్మల కుమార్తె, పదవ తరగతి చదువుతున్న రాష్ట్ర ఖోఖో క్రీడాకారిణి సిద్దగోని శివానిని కలెక్టర్, ఇతర అధికారులు సన్మానించడంతో పాటు ప్రశంసా పత్రం, రూ. 3 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మహ్మద్ సాబేర్, డిడబ్ల్యుఓ మోతీ, సిడిపివో తులసి, సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## 32వ కోనసీమ చిత్రకళ పోటీలలో తెలంగాణ వాసీ ప్రతిభ

**-కొప్పు చంద్రశేఖర్‌కు భారత చిత్రకళ రత్నా అవార్డు**



సీతారామస్వామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొప్పు చంద్రశేఖర్

**ఆమనగల్లు, జనవరి24, ప్రభాతవార్త:**
కోనసీమ చిత్రకళా పరిషత్ 32వ వార్షికోత్సవ మహోత్సవం సంధర్బంగా నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీలలో తెలంగాణ చిత్రకారుడు కొప్పు చంద్రశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచారు. చంద్రశేఖర్ గీసిన చిత్రానికి మొదటి బహుమతి లభించింది. దీంతో భారత చిత్రకళ రత్నా అవార్డుతోపాటు 10వేల రివార్డును కెసిపి వ్యవస్థాపక అధ్యక్షులు కొరసాల సీతారామస్వామి చేతుల మీదుగా ఆయన అవార్డు, రివార్డులను అందుకున్నారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన కొప్పు చంద్రశేఖర్ చిత్రకళలో విశేష ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. కాగా కోనసీమ చిత్రకళా పరిషత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన చిత్రకళలో దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు పలు దేశాలకు చెందిన 789మంది చిత్రకళాకారులు పాల్గొని వారి ప్రాంతాల స్థితిగతులపై చిత్రాలు గీశారు. అందులో కొప్పు చంద్రశేఖర్ లివింగ్ టుగెదర్ చిత్రంతో ఆకట్టుకుని ప్రథమ స్థానంలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపముఖ్యమంత్రి, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, ఆంధ్రప్రదేశ్ దృశ్యకలల అకాడమీ చైర్మన్ కూచిపూడి సత్య శైలజ, కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబుల సమక్షంలో కొప్పు చంద్రశేఖర్ అవార్డును అందుకున్నారు. కాగా తనకు అందజేసిన 10వేల రివార్డు బహుమతిని కొప్పు చంద్రశేఖర్ మరో చిత్రకారుడు ఏల్పుల పోచంకు అంకితం చేశారు. ఏల్పుల పోచం దేశ వ్యాప్తంగా తిరుగుతూ కళాయాత్ర పేరుతో చిత్రకళపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నారు. ఆయన కృషికి గుర్తింపుగా కొప్పు చంద్రశేఖర్ తన రివార్డును తోటి చిత్రకారునికి అంకితం ఇవ్వడాన్ని వేదికపై ఉన్న పెద్దలు కొనియాడారు.

**అభినందించిన స్థానిక కళాకారులు...**

జాతీయ స్థాయి చిత్రకళలో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచిన కొప్పు చంద్రశేఖర్‌ను ఆమనగల్లు మండల చిత్రకారులు అభినందించారు. చిత్రకారులు రూపం వెంకట్‌రెడ్డి నేతృత్వంలో లింగంగౌడ్, కొండల్, గోపిలు చంద్రశేఖర్‌ను శాలువాతో సత్కరించారు. చంద్రశేఖర్ ప్రతిభను కొనియాడుతూ అభినందించారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు జన్మభూమి చింతలపల్లి గ్రామ కీర్తి ప్రతిష్టతలు సైతం గర్వపడేలా ప్రతిభ చాటినట్లు వెంకట్‌రెడ్డి కొనియాడారు.

## పార్టీ పటిష్టతకు కృషి చేయాలి : అధ్యక్షుడు కుర్మయ్య



బూత్ కమిటీ అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేస్తున్న కుర్మయ్య

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 24,(ప్రభాతవార్త):**
గ్రామాల్లో బిజెపి పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు బోయ కుర్మయ్య అన్నారు. జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎదిర గ్రామంలో బిజెపి బూత్ కమిటీని ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. బుత్ కమిటీ అధ్యక్షుడిగా జోగు రామును ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలకు వివరరించాలని అన్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం పమలు చేస్తున్న పథకాలు అర్హులందరికి అందేవిదంగ చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి రాజు, మురళి, నర్సింహులు, రాజ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ



**తలకొండపల్లి జనవరి24,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్‌పల్లి చుక్కాపూర్,జూలపల్లి గ్రామాలలో ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు.మెదక్ పల్లి పాఠశాల విద్యార్థులకు ఉచిత స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో చదవే విద్యార్థులందరికి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని సుమారు కోటి రూపాయలు వెచ్చించి క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్నారని అన్నారు.అదే విధంగా పై చదువులు చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం కూడా చేస్తున్నారని విద్యార్థులు భాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు,ఎంపిటిసి పెంటమ్మ రామస్వామి,పాఠశాల చైర్మన్ పర్వతాలు పాఠశాల కో ఆప్షన్ సభ్యులు దరువుల శంకర్ ,విష్ణు గౌడ్,ఉపాధ్యాయులు రమేష్ రెడ్డి,శోభారాణి వార్డు సభ్యులు చెన్నయ్య,గ్రామస్థులు నరేందర్ గౌడ్, మార్చ మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి పేదలకు భరోసా

**షాబాద్, జనవరి 24, ప్రభాతవార్త :**
ఆడపిల్లల పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు పడే కష్టాన్ని కళ్లారా చూసిన సీఎం కేసీఆర్ నిరుపేదలకు కళ్యాణలక్ష్మితో భరోసా ఇస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 21మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎం సహాయం నిధి 12 చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు చేయడంతో, బంగారు తెలంగాణగా మార్చడంలో సీఎం కేసీఆర్ కీలకపాత్రం పోషించాదన్నా రు. నిరుపేదల అభ్యున్నతికి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమ కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలు, ఆసరా పెన్షన్లు ఇస్తూ నిరుపేదలకు అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ అన్నారు. నేడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ, అభివృద్ధి దేశానికే ఆదర్శంగి నిలుస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ జడల లక్ష్మిరాజేందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మెన్ నర్సింగ్‌రావు, తహసీల్దార్ సైదులు గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## వరదనీటి కాలువ నిర్మాణ పనులకు శాశ్వత పరిష్కారం

### మంత్రి మల్లారెడ్డికి కాలనీ వాసులు వినతి



**నాగారం జనవరి24,ప్రభాతవార్త :** నాగారం మున్సిపాలిటీ పరిధిలో వరద నీరు స్తంభించకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాలకవర్గం,కాలనీ ప్రజలతో కలిసి వరద నీటి సమస్య కొరకు మంత్రి మల్లారెడ్డి కార్యాలయానికి తరలివెళ్లారు.వరదనీటి కాలువ నిర్మాణ పనుల విషయంలో ఎందుకు అభ్యంతర పడుతున్నారని మంత్రి కాలనీ ప్రజలను అడిగారు.మా ఇండ్లలకు వరద మురుగునీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ ప్రజలు మంత్రికి వినతి పత్రం అందజేశారు.మరికొందరు చల్లపల్లి చెరువు ప్రాంతం నుండి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.ఇరుపక్షాలకు సానుకూలంగా వరద మురుగునీరు కాలువ నిర్మాణ పనులను విడతల వారీగా పూర్తి చేస్తామని కాలనీ ప్రజలకు మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ చంద్రారెడ్డి,వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్,కౌకుంట్ల అనంతరెడ్డి,సుర్వి శ్రీనివాస్ గౌడ్,పంగ హరి బాబు, నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్,కొమిరెల్లి సుధాకర్ రెడ్డి,అన్నం రాజు,సురేష్,కౌకుంట్ల కృష్ణా రెడ్డి,వివిధ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ నిఖిల



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్స్ ద్వారా రూపొందించబడిన 2023 సంవత్సరపు క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ నిఖిల ఆవిష్కరించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా టిజివో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటాజీతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్,రెవెన్యూ డివిజనల్ అధికారి విజయ కుమారి,అసోసియేయేట్ ప్రెసిడెంట్ దీప,జనరల్ సెక్రెటరీ మల్లేశం,ట్రెజరర్ రామ్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నార

## అన్నోజిగూడలో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్టు భవన సముదాయం నిర్మాణ షూరూ...



అన్నోజిగూడలో రెండు కోట్ల నిధులతో నిర్మిస్తున్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్టు భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 24, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడ వికలాంగుల కాలనీలో రెండు కోట్ల నిధులతో సమీకృత వెజ్ నాజ్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్సు నిర్మాణం చేపడుతున్నట్లు చైర్మన్ బి. కొండల్ రెడ్డి తెలిపారు. మార్కెట్ భవన సముదాయ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రెండు కోట్ల నిధులతో ఆధునాతన పద్దతిలో మార్కెట్టు భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.సురేశ్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, ఏఈ. నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవతరగతి మండల టాపర్‌కు బహుమతి అందిస్తా : చైర్మెన్ మనోహర్‌రెడ్డి

**దోమ.జనవరి 24 ప్రభాతవార్త :** దోమ మండలంలోని పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పరిక్షల్లో మండల టాపర్ వచ్చిన వారికి బిఎంఆర్ పౌండేషన్ ద్వారా బహుమతి అందిస్తామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మెన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు.మంగళవారం మండల పరిధిలోని బోంపల్లి,మోత్కూర్,అయినాపూర్,బడెంపల్లి,దోమ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు బిఎంఆర్ పౌండేషన్ ద్వారాస్టడిమెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను చిన్న చూపు చుస్తున్నసమయంలో పదవతరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి బిఎంఆర్ పౌండేషన్ ద్వారా అందించిన మెటిరియల్‌ను చక్కగా చదువుకొని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మార్కులు సాదించాలని తెలిపారు. మీ యెక్క తల్లితండ్రులు మీపైన ఆశలు పెట్టుకొని పాఠశాలలకు పంపిస్తున్నారని వారి ఆశలు నెరవేరుటకువిద్యార్థులందరు బాగా చదివిపాఠశాలకు,తల్లితండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు.పదవతరగతి విద్యార్థులు పరిక్షల్లో మెరుగైన పలితాలు సాదించుటకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయుటకు తన ప్రత్యేక సదుపాయం కల్పిస్తానని తెలిపారు. దోమ పాఠశాలకు మైకుసౌండ్,బాత్‌రూములు సదుపాయంకల్పించాలని ప్రదానోపాద్యాయులు పురందాస్ కోరగా తన స్వంత నిదులతో మైకు సౌండ్ ఇప్పిస్తానని,జిల్లా పరిషత్ నిదులద్వారా బాత్‌రూములు ఏర్పాటు చేయిస్తానని మనోహర్‌రెడ్డి హామి ఇచ్చారు.జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్యగౌడ్ మాట్లాడుతూ దోమ పాఠశాలలో చదివిన వారు ఎంతో ఉన్నత పదవులు పొందినారని,ప్రస్తుతం ఈ పాఠశాలలోచదువుతున్న విద్యార్థులు మంచిగా చదివి అలాగే ఉన్నత పదవులు పొందాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యంపిపి అనుసూయ,యంయివో హరిశ్చందర్,యంపిటిసిలు అనితాయాదయ్యగౌడ్,పాఠశాల చైర్మెన్‌లు జ్యోతి,గౌస్, అయినాపూర్ సర్పంచ్‌మల్లేశం,పాఠశాల ప్రదానోపాద్యాయులు పురందాస్,నర్సి ములు,రాఘవేందర్‌రెడ్డి,బంగ్లవెంకటయ్య, జనార్దన్‌గౌడ్, వసంత రావు,ఆయా గ్రామాల పాఠశాల ప్రదానోపాద్యాయులు,పాల్గొన్నారు.



మెటిరీయల్ అందిస్తున్న డిసిసిబి మనోహర్‌రెడ్డి.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

### - షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, జనవరి 24, (ప్రభాతవార్త) :** మారుమూల ప్రాతాలు, గ్రామాలు అభివృద్ధి చెందితినే దేశం అభివృద్ధి చెందుతుందని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలో నూతన గ్రామ పంచాయతీ భవనం, తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభించారు. గ్రామంలో రూ. 20 లక్షలతో నూతన పంచాయతీ భవనం, 3.37లక్షలతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం, 20 లక్షలతో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకు, 14.60లక్షలతో నిర్మించిన వైకుంఠదామం, కంపోస్టు యార్డు, 20 లక్షలతో నిర్మించిన అంతర్గత డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు తదితర పనులను ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గ్రామ సర్పంచి దీనాశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందుతుందని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్విరామంగా కృషి చేస్తున్నారని అన్నారు. వైకుంటదామాలు, క్రీడామైదానాలు, సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ, ఇంటింటికి తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు, ఉచిత కరెంటు వంటి పథకాలతో నేడు ప్రతి గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుంది అంటే అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి పట్టుదలే కారణమని అన్నారు. రాబోయే రోజుల్లో సహితం ప్రతి గ్రామాన్ని మరింత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాడానికి తమ వంతు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజాఇద్రీస్, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూరు విశ్వం, పార్టీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు లక్ష్మన్ నాయక్, గ్రామ సర్పంచి దీనాశంకర్‌యాదవ్, ఫరూఖ్‌నగర్ మండల అధికార ప్రతినిధి జంగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్,వార్డు మెంబర్లు రాజేందర్‌రెడ్డి, లావణ్యమల్లికార్జున్, సుమలతమల్లేష్ యాదవ్,మాధవిదశరథ్, రామలింగంగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, మల్లయ్యయాద వ్, పెంటమ్మ,నాయకులు కటిక శ్రీకాంత్ గ్రామస్థులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్.

# అభివృద్ధి పథంలో గ్రామ సీమలు : ఎమ్మెల్యే ఆనంద్

**మర్పల్లి జనవరి 24 ప్రభాతవర్త :** మర్పల్లి మండలంలోని జాజిగుబ్బడి తాండా పట్లూర్ తాండా అల్లపూర్ గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మీతో నెను కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధికారులు నాయకులతో కలసి గ్రామాల్లోని కాలనీలలో తిరిగి ప్రజలను సమస్యలు ఆడిగి తెలుసుకున్నారు గ్రామంలో నిరు సక్రమంగా రావడం లేదని విద్యుత్ సమస్యలున్నాయని ప్రజలు తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఆనుబంధ గ్రామాల్లో పెన్షన్ ,రేషన్ బియ్యం గ్రామ పంచాయితీలకు వెల్లి తీసుకోవడానికి వృదులు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా ఎక్కడి గ్రామాల వారికి అక్కడే పెన్షల్లు రేషన్ బియ్యం ఇవాలని ఆధికారులకు తెలిపారు. జాజిగుబ్బడి తాండాకు 8 లక్షల రూపాయలు మంజూరి ఇస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. వటితో గ్రామంలో కావలసిన అభివృద్ధి పనులు చేసుకోవాలని కోరారు. అనుబంధ గ్రామాలుగా ఉన్న తాండాలను నాడు ఎవ్వరు పటించుకోలేదని దానితో అభివృద్ధికి నోసుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో నేడు గిరిజన గ్రామాలు ఆభివృద్ధి బాటలో సాగుతున్నాయని అన్నారు. ఆభివృద్దితో పాటు నాయకత్వ లక్షణాలు ఎర్పదుతున్నాయన్నారు. గ్రామాలు పచ్చదనంతో పాటు పారిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల ఆభివృద్ధి కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈసమావేశంలో జడ్పిటీసి మదుకర్ మండల ఉపాద్యక్షులు మొహన్‌రెడ్డి పార్టీ అద్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి నాయకులు నాయబ్‌గౌడ్ శ్రీనివాస్ మదు అశోక్ మల్లేశ్ సర్పంచ్‌లు జయదయాకర్ ఇధిర ఆశోక్ ప్రభాకర్ పలువురు నాయకులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు



ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### -జాతీయ బీసీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్



డిప్యూ ట్యీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

**కొడంగల్,జనవరి 24ప్రభాతవార్త** రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్,ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ధర్నాలు,తహశీల్దార్‌లకు వినతిపత్రాలు అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అద్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపుమేరకు మంగళవారం కొడంగల్ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుండడం దుర్మార్గమన్నారు.ఓ వైపు బంగారు తెలంగాణా రాష్ట్రాన్ని చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు బీసీ,ఈబీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా ఏళ్ళ తరబడి కాలయాపన చేయడం విచారకరమన్నారు. ఇంజనీరింగ్, ఎంసీఏ, పీజీ,డిగ్రీ ఇంటర్ తదితర కళాశాలల్లో చదువే బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజులను ప్రభుత్వమే మంజూరి చేసేలా స్కీం పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఉపకార వేతనాలు,ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా బీసీ విద్యార్థులను చదువులకు దూరంగా అయ్యేలా ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తున్నదని గుర్తు చేశారు.పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్స్‌లను సంత్సరానికి రూ.5500 నుంచి రూ.20వేల వరకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో బీసీల జనాభా ప్రకారం అదనంగా మరో 240 బీసీ గురుకుల పాఠశాలలు,50 డిగ్రీ కళాశాలలు మంజూరీ చేయాలని కోరారు.అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తాలూకా అద్యక్షులు మన్నె బస్వరాజ్ యాదవ్,కొడంగల్ తాలూకా బీసీ విద్యార్ది సంఘం అద్యక్షులు భీమరాజ్,మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వారంలో మన ఊరు -మన బడి పనులను పూర్తి చేయాలి : ఎంపిపి బాలేశ్వర్ గుప్తా

**యాలాల జనవరి 24,ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన ఊరు మన బడి పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని యాలాల ఎంపిపి తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా సూచించారు.మంగళవారం మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డితో కలిసి మండలంలోని దేవనూర్ ప్రాథమిక,ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు మన బడి మరమ్మత్తు పనులను పరిశీలించారు.ఈ పథకం కింద ఆయా పాఠశాలల మరమ్మత్తులు,మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వంరూ.9.62 లక్షలు మంజూరు చేసిందని ఎంపిపి తెలిపారు.అదేవిధంగా గ్రీనరీ కోసం రూ.3లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.1లక్ష విడుదలైనట్లు ఎంపిపి తెలిపారు.ఈ పథకం కింద విడుదలైన నిధులతో పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతతో పాటు అన్ని సౌకర్యాలతో రూపు రేఖలు మారుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రైయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస,మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం మన ఊరు మన బడి పథకంతో పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం హర్షనీయమని ఆయన కొనియాడారు.రూ.కోట్లు నిధులు విడుదల చేసిన కెసిఆర్ సర్కార్ మండలంలో 21 పాఠశాలలను మన ఊరు మన బడి కింద ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నట్లు బాలేశ్వర్ వెల్లడించారు.స్థానిక ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సహాయ సహకారాలతో రానున్నరోజుల్లో మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ పథకం కింద చేర్పించి అన్ని హంగులు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఇప్పటికే పది, పదిహేను పాఠశాలల్లోపనులు చివరి దశకు చేరుకున్నాయని ఎంపిపి చెప్పుకొచ్చారు.వారం రోజుల్లో పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీలు కృషి చేయాలని ఆయన ఆదేశించారు.పనులు పూర్తయిన పాఠశాలలను త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాలేశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిపితో పాటు సర్పంచులు శివకుమార్,మధుసూధన్‌రెడ్డి,నాయకులు శ్రీనివాస్‌గౌడు,ప్రవీణ్, ఎంపిటిసి రాములు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



దేవనూర్‌లో మన ఊరు మన బడి పనులను పరిశీలిస్తున్న ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా

## గట్టుమైసమ్మజాతర హుండీ ఆదాయం రూ.2,12,180లు

**ఘట్‌కేసర్, జనవరి 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర హుండీని లెక్కించారు. దేవస్థానం కార్యాలయంలో ఆలయ ఈఓ ఎల్.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్ సమక్షంలో జాతర సందర్భంగా భక్తులు సమర్పించుకున్న హుండీ డబ్బుల లెక్కింపు చేపట్టారు. భక్తుల నుంచి మొత్తం రూ.2,12,180లు ఆదాయం వచ్చిందని ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా జాతర విజయవంతంగా పూర్త చేసినందుకు ఆమె అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా దేవస్థానం ట్రస్టుబోర్డు తాజా మాజీ సభ్యులను, నాయకులను ఆమె శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, ఆలయ మాజీ డైరెక్టర్లు కందకట్ల పద్మారెడ్డి, బొక్క జంగారెడ్డి, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కులసంఘాల నాయకులు బర్ల హరిశంకర్, పొట్ల చెరువు నారాయణ, గోదా జ్ఞానేశ్వర్, కెఎల్‌జీ ప్రసాద్, అర్చకులు రవీంద్రశర్మ, శ్రీకాంత్, నరేశ్, నవీన్, శ్రీనివాస్, పవన్, బాలకిషన్, పాండు తదితరులు పాల్గొన్నారు.



ఘట్టుమైసమ్మగుట్ట దేవస్థానం కార్యాలయంలో హుండీ లెక్కింపు జరుపుతున్న దృశ్యం

## వాయిదా పడ్డ సర్వసభ్య సమావేశం



**బషీరాబాద్,జనవరి 24,ప్రభాతవార్త:** కోరం లేకపోవటంతో సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు బషీరాబాద్ ఎంపిపి కరుణ అజయ్‌ప్రసాద్ తెలిపారు.మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన సాధారణ సర్వసభ్య సమావేశానికి మండల ఎంపిటిసిలు గైర్హాజరు అయ్యారు.కాగా మధ్యాహ్నం ఒకటి గంటల వరకు వేచి చూసి సమావేశాన్ని వాయిదా వేసిన్నట్లు ఎంపిపి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపిటిసి లకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకోరావాలన్నారు. సమావేశానికి రాకపోవటంతో తమ సమస్యలు ఎలా పరిష్కరించాలని సమావేశంలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపివో రమేష్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

### మేడ్చల్ ట్రాఫిక్ సీఐ బీఎన్ఎన్ రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ బీఎస్ఎన్ రెడ్డి

**మేడ్చల్, జనవరి 24. ప్రభాతవార్త ః** ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ బీఎస్ఎన్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మండల పరిధిలోని కండ్లకోయలో గల సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై విద్యార్థులు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టు తప్పకుండా వాడాలని సూచించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు లైసెన్ కలిగి ఉండాలని, ఇష్టం వచ్చిన రీతిలో వాహనాలు నడుపకుండ ట్రాఫిక్ రూల్స్ పాటించి నడుపాలని తెలిపారు. మధ్యం సేవించి వాహనం నడిపినా, ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్దంగా ప్రవర్థించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ లింగం, కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి. విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కండేయ మహర్షికి ఘన నివాళి



మార్కేండేయ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పద్మశాలి సంఘం నేతల

**మేడ్చల్, జనవరి 24. ప్రభాతవార్త ః** మార్కేండేయ మహర్షి జయంతిని మేడ్చల్‌లో పద్మశాలి సంఘం ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పట్టణ పద్మశాలి సంఘం నేతలు మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రుద్ర జనార్దన్, నాగ బలరాం, కవిరాజు, కర్దాస్ రమేష్, నారా నగేష్, దేవానంద్, భాస్కర్, అనిల్, నాగరాజు, అంజనేయులు, రామాంజనేయులు, మహేష్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## నల్లవెల్లి గ్రామాన్ని సందర్శించిన ఐడిబిఐ అఫీషియోల్స్



సమావేశంలో మాట్లాడుతున్న ఐడిబిఐ అఫీషియోల్స్

**యాచారం, జనవరి 24 ప్రభాతవార్త** మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామాన్ని మంగళవారం యాచారం ఐడిబిఐ బ్యాంకు అఫీషియోల్స్ 35 మంది సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళా సంఘాలు, గ్రామ సంఘం ఎలా సమావేశాలు జరుపుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా చిన్నపాటి వ్యాపార లావాదేవీలు, దుకాణాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకు లింకేజికి సంబంధించిన లోన్ల విషయం, ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్షన్‌లో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో 11 రాష్ట్రాల నుండి బ్యాంకు ఆఫీషియోల్స్ పాల్గొన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కొప్పు సుకన్య భాష ముఖ్య అతిధిగా పాల్గొన్న కార్యక్రమంలో డిఎంటి కె. జంగా రెడ్డి, డిఆర్‌డివో బాలరాజు, ఏపీఎం సతీష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ లైసన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

**కొడంగల్,జనవరి 24ప్రభాతవార్త** కొడంగల్ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో డివిజన్ పరిధిలోని కొడంగల్,బొంరాస్‌పేట్,దౌల్తాబాద్ మండలాలకు చెందిన ఎరువుల డీలర్‌లకు ఆన్‌లైన్ లైసన్స్ సిస్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ హజరై మాట్లాడారు.రైతులకు ఎరువులు, విత్తనాలు,పురుగుల మందులు విక్రయించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.రైతులు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు విధిగా ఆధార్‌కార్డును కచ్చితంగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, కొడంగల్ ఏఓ బాలాజీ ప్రసాద్,దౌల్తాబాద్ ఏఓ లావణ్య,బొంరాస్‌పేట్ ఏఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

**బషీరాబాద్,జనవరి 24,ప్రభాతవార్త:** బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామంలో శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు మంగళవారం నాడు గ్రామ పెద్దలు, యువకులు కలిసి బస్ స్టేషన్ కూడలి వద్ద భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా యువకులు,పెద్దలు మా ట్లాడుతూ గతంలో భూసేకరణ చేసి మంగళవారం నాడు విగ్రహ ప్రతిష్టాపన కోసం భూమిపూజ చేశారు.కార్యక్రమంలో యువకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

**తలకొండపల్లి జనవరి24,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట 41వ రోజు పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమంలో ఒరుగంటి వెంకట్ రెడ్డి,పాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ జడ్పిటిసి పద్మ నర్సింహా ముదిరాజ్,చాలిచిమాల మల్లేష్, కుమార్, యాదయ్య, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

